నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com
1

అన్న జ్ఞాపకార్థం నగదు అందజేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలో మే18 నుండి జరగనున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి మద్దెల ప్రసాద్ తన అన్న మద్దెల ప్రదీప్ జ్ఞాపకార్థం లీగ్‌లో పాల్గొనే ఏ హంగ్రీ హంటర్స్ జట్టు సభ్యులకు క్రీడాదుస్తుల కోసం రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జట్టు కెప్టెన్ జాదవ్ పవన్ కుమార్, మద్దెల ప్రదీప్ కుమారుడు మద్దెల విసీల్, లీగ్ నిర్వాహకులు లఖన్, అనిల్, దినేష్, యోగి, గణేష్, సిద్ధూ, ఆదిత్య, సునీల్, రాజేష్, మణిరాజ్ పాల్గొన్నారు.



ఓటేసి ఆదర్శంగా నిలిచిన ట్రాన్స్‌జెండర్స్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో పురుషులు, మహిళలే కాకుండా ట్రాన్స్‌జెండర్స్ సైతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంటు పోలింగ్ ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని పిట్టలవాడ, రామ్‌నగర్, వడ్డెర కాలనీతో పాటు ఉట్నూర్‌లో ఉన్న ట్రాన్స్‌జెండర్స్ సోమవారం తమ పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పిట్టలవాడలోని ట్రాన్స్‌జెండర్స్ అందరూ పోలింగ్ కేంద్రం వద్ద ఫొటో దిగి ఓటు వేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.



ఓటెత్తిన జనం..!

- ఆదిలాబాద్‌లో 5గంటల వరకు 69.81శాతం నమోదు
- పెద్దపల్లిలో 67.80 శాతం పోలింగ్ నమోదు
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల్లో బారులు
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- వివిధ చోట్ల ఎన్నికల బహిష్కరణ..అధికారుల జోక్యంతో ప్రారంభం

ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు జనం ఆసక్తి కనబర్చారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వరుసకట్టారు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఉదయం 7గంటలకు ప్రారంభమై సాయంత్రం 4గంటలకు ముగియగా.. మిగితా ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో సాయంత్రం 6గంటల వరకు కొనసాగింది. కాగా ఉదయం పూట కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో కొద్ది సమయం పాటు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది వాటిని బాగు చేయడంతో తిరిగి ప్రారంభమైంది. మరోపక్క దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని పలు గ్రామాల ప్రజలు ఎన్నిక బహిష్కరించి నిరసన తెలిపారు. అధికారుల జోక్యంతో తిరిగి ప్రారంభం కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరికొన్ని చోట్ల కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వివాదం..ఘర్షణలు తలెత్తడం మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల క్రతువులో అత్యంత కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ పరి సమాప్తమైంది. ఓటేసేందుకు జనం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పల్లె, పట్టణాల్లో సందడి వాతావరణం కనిపించింది. ఓటు ప్రాముఖ్యతపై జనం అవగాహన కలిగి ఉండటంతో ఇంటి వద్దనే ఉన్నారు. అనేక మంది ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార యంత్రాంగం ఆయా కేంద్రాల వద్ద ఓటర్లకు వివిధ రకాల సౌకర్యం కల్పించింది. తాగునీరు, టెంట్ తదితర సౌకర్యాలు ఏర్పాటుచేయడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఐదు గంటల వరకు 69.81 శాతం నమోదు కాగా.. ఆదిలాబాద్‌లో 69.82, బోథ్‌లో 74.08, ఖానాపూర్‌లో 67.02, నిర్మల్‌లో 69.03, ముధోల్‌లో 72.73, సిర్పూర్‌లో 68.14, ఆసిఫాబాద్‌లో 67.02, పెద్దపల్లిలో సాయంత్రం 6గంటల వరకు 67.80 పోలింగ్ శాతం నమోదైంది. నియోజకవర్గంలోని మంచిర్యాలలో 59.78, చెన్నూరలో 68.13, బెల్లంపల్లిలో 70.50 శాతం పోలింగ్ నమోదైంది. ప్రధాన పార్టీల నుంచి బరిలో దిగిన అభ్యర్థులు ఉదయం పూటనే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేయగా.. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు కుటుంబ సభ్యులతో కలిసి తన సొంతూరైన తిర్యాణి మండలం లక్ష్మీపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ బజార్‌హత్నూర్ మండలం జాతర్లలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మంచిర్యాలలో ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు

ఎన్నిక బహిష్కరించి నిరసన..!

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల ప్రజలు ఓటింగ్‌ను బహిష్కరించడం చర్చనీయాంశమైంది. రోడ్డు సౌకర్యం కల్పించాలని కడెం మండలం అల్లంపల్లి గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, అదనపు కలెక్టర్ జోక్యం చేసుకొని గ్రామస్తులకు నచ్చజెప్పడంతో మధ్యాహ్నం 2గంటలకు తిరిగి ప్రారంభమైంది. బజార్‌హత్నూర్ మాన్కాపూర్‌లోనూ రోడ్డు సౌకర్యం, సెల్‌ఫోన్ సిగ్నల్, త్రీఫేస్ సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు ఎన్నికను బహిష్కరించగా.. అధికారుల జోక్యంతో తిరిగి ప్రారంభమైంది. ఇదే మండలంలోని దేగామ చెరువు ముంపు పునరావాసం అందరికీ కల్పించాలని ఆ గ్రామస్తులు ఎన్నిక బహిష్కరించగా అధికారులు వారికి నచ్చజెప్పడంతో తిరిగి పోలింగ్ ప్రారంభమైంది. ఇచ్చోడ మండలం బాబ్జీపేట్‌లో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఉదయం పూట ఓటింగ్‌ను బహిష్కరించగా..కాగజ్‌నగర్ మండలం బోరిగాంలోనూ ఉదయం 11గంటల వరకు ప్రారంభం కాకపోవడం.. కాసిపేట మండలం కోమటిచేను పంచాయతీ పరిధిలోని వరిపేట గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించగా అధికారులు నచ్చజెప్పడంతో మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో కొద్ది సేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల, మహాలక్ష్మీవాడ కేంద్రాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వివాదం తలెత్తింది.



ఆసిఫాబాద్‌లో బారులు తీరిన ఓటర్లు



తలమడుగులో ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు



ఓటేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు



ఓటేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థులు

పోలింగ్ ప్రశాంతం..!

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద వివిధ రకాల సౌకర్యాలు కల్పించడం.. పోలీసుల పకడ్బందీ బందోబస్తు కారణంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. లోక్‌సభ పరిధిలో ముందస్తుగానే గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడం ..గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటుచేశారు. ఎన్నికల పరిశీలకుడు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పలు కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కమ్యూనికేషన్ కంట్రోల్ రూం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. భారీ భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలించారు.

పసిపాపతో వచ్చి ఓటేసి..

నవతెలంగాణ-తలమడుగు

రుయ్యాడి గ్రామానికి చెందిన అశ్విత తన మూడు నెలల పాపతో పోలింగ్ స్టేషన్‌కు వచ్చి సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యంగా భావించి ఇష్టం ఉన్న వారికి ఓటు వేయాలన్నారు. వజ్రం కంటే విలువైన ఓటును దేశంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



ఆకట్టుకుంటున్న ఆదర్శ పోలింగ్ కేంద్రాలు

ఆకట్టుకున్న ఆదర్శ పోలింగ్ కేంద్రాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జిల్లా వ్యాప్తంగా 24 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా బోథ్ 12, ఆదిలాబాద్‌లో 12 చొప్పున ఉన్నాయి. ఇందులో వికలాంగులు, మహిళలు, యువత, సాధారణ ఆదర్శ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించారు. సోమవారం పోలింగ్ రోజు ఆయా కేంద్రాలకు వెళ్లి ఓటర్లు ఓటేశారా. పట్టణంలోని డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ కేంద్రం వద్ద ఆదివాసీ సంస్కృతి ప్రకారం డోలు వాయిస్తు ఓటర్లను స్వాగతించేలా ఏర్పాట్లు చేయడం ఆకట్టుకుంది. వన్ టౌన్ ఎదుట గల డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళ పోలింగ్ స్టేషన్ ఆకట్టుకుంది. అదే విధంగా పట్టణంలోని కోలాం ఆశ్రమ పాఠశాలలో తోరణాలు కట్టి స్వాగతం చెప్పేలా వాతావరణం కల్పించారు. వీటితో పాటు సెల్ఫీ పాయింట్‌లు ఏర్పాటు చేశారు. ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు సెల్ఫీ పాయింట్‌లో ఓటేసినట్లు ఫొటో దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకున్నారు. పోస్టు చేస్తూ మేము ఓటేశాము..మీరు వేశారా అంటూ క్యాప్షన్‌లు పెడుతూ ఆదర్శంగా నిలిచారు.

కజ్జర్ల గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-తలమడుగు

పార్లమెంట్ ఎన్నికల్లో పంచాయతీ కార్యదర్శి ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా బీఆర్ఎస్ నాయకులకు భోజనాలు పెట్టారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సెక్టార్ అధికారి తిరుపతికి కాంగ్రెస్, బిజెపి, డిఎస్‌పి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్, కాంగ్రెస్ నాయకులు కమలాకర్, పోశెట్టి, బిజెపి నాయకులు శారద, స్వామి ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

నవతెలంగాణ-హాజీపూర్

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. 32 పోలింగ్ కేంద్రాల్లో 69.18 పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం పోలింగ్ మొదలైన వెంటనే అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించాయి. నంనూర్ 124 బూత్ మాక్ పోలింగ్ సందర్భంగా ఈవీఎం మొరాయించడంతో అర గంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. కర్ణమామిడి 111 బూత్, సబ్బపల్లి 106వ బూత్‌లో కూడా ఈవీఎంలు మొరాయించడంతో సరి చేసిన అధికారులు నిమిషాల వ్యవధిలో పోలింగ్ జరిగేలా చూశారు. సాయంత్రం 4.30గంటల లోపే మండలంలో పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. రాపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీ నినాదాలు చేయడంతో ఎస్సై గోపతి సురేష్ చేరుకుని ఇరు గ్రూపులను చెదరగొట్టారు.

లక్ష్మణచాంద: మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పొట్టపెల్లి(కె) గ్రామంలో ఉదయం పూట ఈవీఎం మొరాయించడంతో 3గంటల పాటు పోలింగ్ ఆగిపోయింది. తదుపరి మరొక ఈవీఎం ఏర్పాటు చేయడంతో పోలింగ్ కొనసాగింది. అయినప్పటికీ ఆ గ్రామంలో 82శాతం పోలింగ్ కావడం విశేషం. మొత్తానికి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ముధోల్ : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం జరిగింది. చించాల గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో సుమారు 35నిమిషాల పాటు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. రువ్వి గ్రామంలో తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం వరకు మందకోడిగా కొనసాగిన ఓటింగ్ శాతం మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆడిషనల్ ఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు



హాజీపూర్ : పోలింగ్ ముగిసిన తర్వాత బాక్సులతో బయల్దేరిన పోలింగ్ సిబ్బంది

కుభీర్ : లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 39,814 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 20351, పురుషులు 19462 ఉన్నారు. ఇందులో 29244 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 73.45 శాతం ఓట్లు పోల్ అయ్యాయని ఎన్నికల అధికారి సోము తెలపారు.

ఉట్నూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని 73పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలీసు బలగాల బందోబస్తు, ప్రజల సహాయ సహకారాలతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

లోకేశ్వరం : మండలంలోని 25 పంచాయతీల్లోని 38 పోలింగ్ కేంద్రాల్లో 29101 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 13551, మహిళలు, 15547, ఇతరులు ముగ్గురు ఉన్నారు. మొత్తం 22466 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 77.20శాతం పోలింగ్ నమోదైంది.

బోథ్: పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలోని 49 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 6 గంటల వరకు 74.8 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారి కుష్బు గుప్తా తెలిపారు.

బేల : మండలంలో 41 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 9గంటల వరకు ఓటర్లు పల్చగా కన్పించారు. పోలింగ్ కేంద్రాలను ఎస్సై రాధిక ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వృద్ధులకు పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడానికి వీల్‌చైర్‌లను, వాలంటీర్‌లను ఏర్పాటు చేశారు.

తాంసి : మండలంలో 13 గ్రామ పంచాయతీలకు మొత్తం 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 13వేల621 మంది ఓటర్లు ఉండగా 11వేల335 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 83 శాతం పోలింగ్ జరిగినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మండల కేంద్రంలోని 41వ పోలింగ్ కేంద్రంలో రెండు గంటల సేపు ఈవీఏం మొరాయించడంతో ఓటర్లు కొంతమంది వెనుదిరిగి పోయారు. పొన్నారి గ్రామంలో 38వ పోలింగ్ బూత్‌లో చర్ల పొచ్చన్న ఓటును ఎవరో వేసి పోవడంతో పోలింగ్ అధికారిని నిలదీయడంతో డిమాండ్ ఓటుకు అవకాశం కల్పించారు. భీంపూర్ మండలం బెల్సార్ రాంపూర్, ధనోర పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు కొంతసేపు మొరాయించడం మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

లక్ష్మణచాంద : ఓటేసేందుకు క్యూలో నిలబడ్డ మహిళా ఓటర్లు





లోకేశ్వరం : ఓటు హక్కు వినియోగించుకున్న యువకులు

భవితవ్యం.. నిక్షిప్తం..!

- జనం ఆదరణ ఎవరికోనని అభ్యర్థుల్లో గుబులు
- ఓటర్ల తీర్పు ఈవీఎంలలో భద్రం
- పోలింగ్ సరళిపై పార్టీలు, అభ్యర్థుల ఆరా
- వివిధ సర్వేల ఆధారంగా గెలుపోటములపై అంచన
- జూన్ 4న వెల్లడికానున్న లోక్‌సభ ఫలితాలు

ఆదిలాబాద్, పెద్దపల్లి లోక్‌సభ బరిలో నిలిచిన రాజకీయ పార్టీలు..అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ప్రచారంలో పడిన కష్టమంతా ఒక్కచోటకు చేరింది. ఈవీఎంలలో భద్రంగా దాగింది. సోమవారం పోలింగ్ పూర్తికావడంతో ఓటరు తీర్పు ఎలా ఉందోనని సర్వత్రా ఉత్కంఠకు దారితీస్తోంది. జనం ఎవరిని ఆదరించారు..ఎవరిని దూరం పెట్టారోనని అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సొంత సర్వేలు చేయించడంతో పాటు పార్టీలు చేయించిన సర్వేల ఆధారంగా గెలుపోటములను అంచనా వేస్తున్నారు. మరోపక్క లోక్‌సభ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన పోలింగ్ సరళిని..అక్కడి జనం వ్యక్తం చేసిన అభిప్రాయాలను పార్టీల కార్యకర్తలు, శ్రేణులను అడిగి తెలుసుకుంటున్నారు. అభ్యర్థులే కాకుండా ఆయా పార్టీల కీలక నేతలు సైతం ఉదయం నుంచి పోలింగ్ సరళిని గమనిస్తూ జనం తీర్పుపై ఒక అంచనాకు వస్తున్నారు. తాజాగా పోలింగ్ ముగియడంతో అందరి చూపు జూన్ 4న వెల్లడయ్యే ఫలితాలపైనే కేంద్రీకృతమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ సీటును దక్కించుకునేందుకు ప్రధాన పార్టీలు తీవ్రంగా పోటీపడ్డాయి. నువ్వా- నేనా అనే రీతిలో ప్రచార పర్వాన్ని సాగించాయి. ఆయా పార్టీల అగ్రనేతలు సైతం వచ్చి ఇక్కడకు వచ్చి ప్రచారం నిర్వహించారు. సుమారు రెండు నెలల పాటు ఎండలను లెక్కచేయకుండా ప్రచారం చేపట్టారు. జనాన్ని తమవైపు తిప్పుకునేందుకు వివిధ రకాల ప్రలోభాలకు కూడా గురిచేసినట్లు ప్రచారం జరిగింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ప్రచార పర్వం ఈ నెల 11వ తేదీతో పరిసమాప్తం కావడం.. తాజాగా సోమవారం పోలింగ్ జరగడంతో ఎన్నికల క్రతువులో కీలక ఘట్టం పూర్తయింది. ఉదయం నుంచి జనం పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం..మధ్యాహ్నం వరకే 50శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం వరకు మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. పోలింగ్ శాతం పెరుగుతుండటంతో ఎవరికి అనుకూలంగా ఉంటుంది..ఎవరికి ప్రతికూలంగా ఉంటుందోనని ఆయా పార్టీల అభ్యర్థుల్లో చర్చలు మొదలయ్యాయి. ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన ఓటింగ్ శాతాన్ని అంచనా వేసి గెలుపోటములను కూడా నిర్ణయిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా ఎక్కడెక్కడ ఏయే పార్టీకి మెజార్టీ వస్తుంది.. ఎక్కడ తక్కువగా వస్తాయనే అంచనాల్లో తలమునకలయ్యారు.

సర్వేల ఆధారంగా నిర్ణయం..!

పోలింగ్ క్రతువు కొనసాగుతుండగానే ఆయా పార్టీలు, అభ్యర్థులతో పాటు వివిధ సర్వే సంస్థలు జనం నాడిని తెలుసుకునే ప్రయత్నం చేశాయి. ఓటేసిన తర్వాత జనాన్ని కదిలించి వారి నుంచి వచ్చిన స్పందనను బట్టి ఒక అంచనాకు వచ్చారు. ఫలితంగా ఎక్కడ ఏ పార్టీకి అనుకూలంగా ఓట్లు పడ్డాయి.. ఎవరికి ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి..? తదితర వాటిని బేరీజు వేసుకున్నారు. తీరా సజావుగా పోలింగ్ ప్రక్రియ పూర్తికావడంతో ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడే ప్రధాన పార్టీల్లో గెలుపోటములపై చర్చలు ఊపందుకోగా.. స్వతంత్ర అభ్యర్థులు, వివిధ పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులు వారికి వచ్చే ఓట్లను లెక్కలు వేసుకుంటున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఆయా సర్వే సంస్థలు ఇచ్చిన నివేదికల ఆధారంగా ముందుగానే గెలుపోటములను నిర్ణయించుకోవడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఇన్నాండ్లు పడిన కష్టమంతా ఈవీఎంలలో భద్రం కావడంతో ఇక అందరి దృష్టి ఫలితాలపైనే పడింది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కావడంతో అభ్యర్థులు, పార్టీల్లో అప్పటి వరకు ఉత్కంఠ తీరే పరిస్థితి కనిపించడం లేదు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

దు:ఖాన్ని దిగమింగుతూ..

ఓటేసిన వ్యాపారి కుటుంబం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



దు:ఖాన్ని మింగుతూ సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓ వ్యాపారి కుటుంబం ఓటేసింది. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి ఇటీవల ఆస్ట్రేలియాలో మృతి చెందాడు. మృతదేహం ఆస్ట్రేలియా నుంచి ఇండియాకు రాలేదు. అయిన ఆ వ్యాపారి కుటుంబ సభ్యులు తమ దు:ఖాన్ని దిగమింగుతూ ఓటేసి ఓటు ప్రధాన్యతను తెలియజేశారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువను గుర్తించిన వారి కుటుంబ సభ్యులు నితేష్, సారిక, యోగేష్, నికిత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల సరళిని పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పార్లమెంట్ ఎన్నికల సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఓటు నమోదు శాతాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎక్కడ కూడా పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. ఎలాంటి ఇబ్బందులున్న పర్యవేక్షణ అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న మండలాల్లో అక్కడి అధికారులతో మాట్లాడి శాతాన్ని పెంచేలా చూడాలని సూచించారు. అలాగే ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ పరిశీలించారు.

అధికారుల హామీతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సమస్యలు పరిష్కరించాలని ఎన్నికలను బహిష్కరించిన సంఘటన మండలంలోని మన్నాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. తమ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా రోడ్డు, త్రీఫేజ్ విద్యుత్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ రావడం లేదని, అదేవిధంగా 108, 102 వాహనాలు సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శంకర్ కలెక్టర్, పీఓలకు సమాచారం అందించారు. స్పందించిన వారు సమస్యలు పరిష్కరిస్తామని తెలుపడంతో పోలింగ్ కేంద్రంలో నెంబర్ 202లో మధ్యాహ్నం 12గంటలకు ఎన్నికలు ప్రారంభమైంది.

దేగామ గ్రామంలో..

దేగామ గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. ప్రభుత్వాలు మారిన తమ సమస్యలు మాత్రమే అలానే ఉంటున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామం ప్రాజెక్టు కింద ముంపుకు గురైందని, కొందరికి మాత్రమే పునరావాసం కల్పించారని పేర్కొన్నారు. ఏ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎన్నికలను బహిష్కరించారు. విషయం తెలుసుకున్న స్థానిక తహసీల్దార్ శంకర్ గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరిస్తామని అన్నారు. దీంతో గ్రామస్తులు ఒక్కరొక్కరుగా ఓటు వెళ్లి ఓటు వేశారు.

కడెం : మండలంలోని అల్లంపెల్లి, బాబానాయక్ తాండ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించేంత వరకు తాము ఓట్లు వేయమని ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు సోమవారం వెళ్లలేదు. అయితే గతంలో అధికారులు, నాయకులు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇచ్చి మర్చిపోయారనీ గ్రామస్తులు ఆరోపించారు. రెండు గ్రామాలు కలిసి దాదాపు 15 వందల మంది పోలింగ్ కేంద్రాలకు రాకపోవడంతో సంబంధిత అధికారులు జిల్లా అధికారులకు తెలుపడంతో వెంటనే స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఏఎస్పీ సూర్యనారాయణ, ఇన్‌చార్జి డీఎస్పీ రమణమూర్తి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గ్రామానికి చేరుకొని గ్రామస్తుల రోడ్డు సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించి మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటును వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో నిలబడి ఓట్లు వేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ అరుణ, ఎన్నికల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





ఇచ్చోడ : మండలంలోని బాబ్జిపేట్ గ్రామస్తులు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటు వేయలేదు. తమ గ్రామంలోని సమస్యలు పరిష్కరిస్తేనే ఓట్లు వేస్తామని అన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హామీతో మధ్యాహ్నం ఒంటి గంటకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామంలో త్రీపేజ్ విద్యుత్, బీటీ రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ప్రతిసారి ఎన్నికల ముందు ప్రజాప్రతినిధులు, అధికారులు బీటీ రోడ్డు, త్రీపేజ్ కరెంట్ వచ్చే విధంగా హామీలు ఇవ్వడం, మర్చిపోవడం జరుగుతుందని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో గ్రామానికి వచ్చి గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని, మాజీ సర్పంచ్ లక్ష్మి దేవురావు, గ్రామ యువ నాయకులు గుండాల రమేష్ తెలిపారు.

ఓటు హక్కు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-నార్నూర్

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం తన స్వగ్రామం భీంపూర్‌లో బూత్ నెంబర్ 31లో ఓటు హక్కును జెడ్పీచైర్మెన్ దంపతులు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరు తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. పార్లమెంట్ లో గళం ఎత్తి ప్రశ్నించే గొంతుకకే తాను ఓటు వేశానని తెలిపారు. అదేవిధంగా మాన్కాపూర్ గ్రామపంచాయతీలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజేశ్వర్ రాథోడ్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారితో పాటు ఉట్నూర్ జెడ్పీటీసీ చారులతా రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జాదవ్ శ్రీరాం నాయక్, వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, మాజీ సర్పంచ్ విష్ణు రాథోడ్, మాజీ ఎంపీపీ మెస్రం రూపదేవ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, శ్రీకాంత్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరిన జనం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోలింగ్ బూత్‌ల వద్ద జనం బారులు తీరారు. వాతావరణం చల్లగా ఉండటంతో కొంత ఉపశమనం లభించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ మండలంలో దాదాపు 34 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని రూట్ ఆఫీసర్ వెంకటరాజు తెలిపారు. భీంసరి గ్రామంలో పోతు భూధమ్మ(83), ఆరే లింగమ్మ(88), పశుల రుకుంబాయి 89, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటేసిన శతాధిక వృద్ధుడు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పార్లమెంట్ ఎన్నికల్లో మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధుడు జైస్వాల్ మోహన్ లాల్ తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. తన కుమారుడైన జైస్వాల్ సంతోష్‌తో కలిసి భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకున్నామని తెలిపారు.

రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం ఓటు హక్కు

నవతెలంగాణ-నిర్మల్

రాజ్యాంగం కల్పించిన గొప్ప వరం ఓటు హక్కు అని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 237 కలెక్టర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఓటర్లంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు. ఓటింగ్ శాతం పెరిగిందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ కేంద్రంలోని ఏర్పాట్లను పరిశీలించారు.

మొరాయించిన ఈవీఎంలు..

సరి చేసిన టెక్నికల్ సిబ్బంది



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలోని బూత్ నెంబర్ 189 పోలింగ్ కేంద్రంలో సోమవారం ఈవీఎం మొరాయించింది. పోలింగ్ ప్రారంభమైన కొద్ది సమయానికే ఈవీఎంలు పని చేయక పోవడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి టెక్నికల్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఈవీఎంను సరి చేయడం తో ఓటర్లు యదావిధిగా వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్ల సౌకర్యం కోసం పంచాయతీ కార్యదర్శి కదంబ మహేష్ గ్రామంలో ఏర్పాటు చేసిన 188, 189, 190 పోలింగ్ బూత్‌లో టెంట్లు, తాగునీరు, వికలాంగుల కోసం వీల్ చైర్ వంటి సదుపాయాలు కల్పించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ సజావుగా కొనసాగింది.

మొదటి సారి ఓటు హక్కు

వినియోగించుకున్న యువత

నవతెలంగాణ-లోకేశ్వరం

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా సోమవారం మండలంలోని రాజుర గ్రామానికి చెందిన యువకులు మొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా.బాబా సాహెబ్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని కోరారు.

తలమడుగు : మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువతులు పార్లమెంట్ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేసినందుకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. మొదటగా అసలు ఓటు ఏ విధంగా ఉంటుందో ఎలా వేస్తారో తెలియని పరిస్థితి ఉండేదని స్వయంగా మాకు 18 సంవత్సరాలు నిండి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో మురిసిపోయారు. భారతదేశ పౌరులు 18 సంవత్సరాల నుంచి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని యువతులు కోరారు.

పోలింగ్ కేంద్రం వద్ద ఇరుపార్టీల మధ్య వాగ్వావాదం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సంబంధించిన నాయకుల మధ్య స్వల్ప వాగ్వావాదం జరిగింది. ఓటేయడానికి వచ్చిన ఎమ్మెల్యే పాయల శంకర్ కషాయి కండువా వేసుకోవడంపై కాంగ్రెస్, సీపీఐ మహిళ నాయకురాళ్లు సాయిమౌనరెడ్డి, ముడుపు నళినిలు నిలదీశారు. పోలీసులు సాధారణ ప్రజలకు సెల్‌ఫోన్‌లు అనుమతించడం లేదని, కానీ ఎమ్మెల్యేకు కండువ, సెల్‌ఫోన్ ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. కండువ వేసుకోని పోలింగ్ కేంద్రానికి రావడంపై అసహనం వ్యక్తం చేయడంతో బీజేపీ నాయకులు సైతం వారితో వాగ్వాదానికి దిగారు. పార్టీ కండువా కాదని హిందువుల ఆత్మగౌరవ కషాయ కండువని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే వారితో మాట్లాడకుండా అక్కడి వెళ్లిపోవడంతో గొడవ సద్దుమనిగింది. అనంతరం ఈ విషయం తెలుసుకున్న ఒకటవ పట్టణ సీఐ సత్యనారాయణ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

తలమడుగు : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడికి గ్రామపంచాయతీ కార్యదర్శి భోజనం పెట్టగా, అక్కడున్న కాంగ్రెస్, డీఎస్పీ నాయకులు కార్యదర్శిని మందలించారు. పంచాయతీ కార్యదర్శిపై కాంగ్రెస్, డీఎస్పీ నాయకులు బీఆర్ఎస్ నాయకుడికి ఒక్కడికే భోజనం ఎలా పెడుతావని హెచ్చరించారు. ఈ విషయంలో గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్సై ధనశ్రీ సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురి పార్టీ నాయకులను సముదాయించి బయటకు పంపించారు. పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేయనున్నట్టు కాంగ్రెస్ డీఎస్పీ నాయకులు తెలిపారు.



తలమడుగు : ఎస్ఐతో నాయకుల వాగ్వాదం

ఓటేసిన ఆదిలాబాద్ కలెక్టర్, ఎస్పీ



ఓటేసి వేలును చూపిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రజలు వాటిని వినియోగించుకుంటు మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబర్ 262లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ గౌస్ ఆలం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయమే కేంద్రానికి వారు చేరుకోని ఓటు వేశారు. పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ ప్రశాంతంగా జరుగుతుందన్నారు. ఉదయం మాక్ పోల్ నిర్వహించిన తరువాత ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎక్కడ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా ఓటింగ్ జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఓటరు ప్రశాంత వాతావరణంలో తమ హక్కును వినియోగించేలా బందోబస్తును చేపట్టామని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న వివిధ పార్టీల నాయకులు



ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిర్మల్

లోకసభ ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు తమ తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు. నిర్మల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని గాజులపేటలోని పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ మండలంలోని తమ స్వగ్రామం ఎల్లపెల్లిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మామడ మండలం దిమ్మదుర్తిలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఆయా పార్టీల నాయకులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ తమ పార్టీల అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

లోకేశ్వరం : మండలంలోని మన్మద్ గ్రామంలో ఉదయం నుంచి ఓటేయడానికి ప్రజలంతా బారులు తీరారు. వారంతా ఓపిగ్గా క్యూలో నిల్చుని తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు.



జందాపూర్ ఓటు వేసేందుకు వరుసలో కూర్చున్న ఓటర్లు

ఓటు హక్కును వినియోగించుకున్న

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉట్నూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తన కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని 81వ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం విజయసంకేతంతో నేను ఓటు వేశాను. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో

ఎన్నికల సరళిని పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-తలమడుగు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రల పర్యవేక్షణలో భాగంగా మండలంలోని రుయ్యాడి, సుంకిడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. అక్కడి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట స్థానిక ఎస్సై ధనశ్రీ ఉన్నారు.

కుటుంబ సభ్యులతో కలిసి ఓటు

వేసిన బోరంచు శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం మావల జెడ్పీ పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న

జెడ్పీటీసీ దంపతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండల కేంద్రంలోని 141 బూత్‌లో సోమవారం మావల జెడ్పీటీసీ నల్ల వనితా రాజేశ్వర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని అన్నారు.

3

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

ఓటేసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఓటేశారు. సోమవారం తన స్వగ్రామమైన తిర్యాని మండలం లక్ష్మీపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని కేంద్రంలో తన ఓటేసి విజయకేతనం చూపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలన్నారు. ప్రజల తీర్పు తనకు అనుకూలంగా వస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధియే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

పంపిణీ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లావ్యాప్తంగా రెండు నియోజకవర్గాల్లో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో సాయంత్రం 4 గంటల వరకు జిల్లావ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ పూర్తికాక అప్పటికే క్యూలో ఉన్న వారితో ఓటు వేయించి ఈవీఎం, వీవీ ప్యాట్లతో పోలింగ్ సిబ్బంది రాత్రి 8 గంటల వరకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాలకు చేరుకున్నారు. తిరిగి వచ్చిన సిబ్బంది నుండి పోలింగ్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్న అధికారులు ఈవీఎంలను ఆదిలాబాద్‌కు ప్రత్యేక వాహనాల్లో పంపించారు.

జిల్లాలో తగ్గిన ఓటింగ్ శాతం

- గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం
- పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు తేడా
- పనిచేయని అవగాహన కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం తగ్గింది. నాయకుల చొరవ ఓటర్ల అనాసక్తత ఓటింగ్ శాతంపై ప్రభావం చూపినట్టు తెలుస్తోంది. కారణం ఏదైనా జిల్లాలో తగ్గిన ఓటింగ్ శాతం పార్లమెంట్ స్థానం గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లాలో తగ్గిన ఓటింగ్ శాతం

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 2019 పార్లమెంటు ఎన్నికల్లో ఆసిఫాబాద్‌లో 73.96 శాతం, సిర్పూర్‌లో 69.55శాతం ఓటింగ్ నమోదైంది. దీనితో పోలిస్తే సిర్పూర్ నియోజకవర్గంలో 1,52,706 మంది 67.21శాతం తమ ఓటు హక్కు వినియోగించుకోగా, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 156098 మంది 68.14శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం తగ్గింది.

గెలుపోటములపై ప్రభావం

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా ఆసిఫాబాద్ సిర్పూర్ నియోజకవర్గాలు ఎటువైపు మొగ్గితే ఆ అభ్యర్థి గెలుస్తాడని నానుడి ఉంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇదే రుజువైంది. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడంతో అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు తేడా

ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్దకు చేర్చడంలో స్థానిక నాయకులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం, పార్లమెంట్ నియోజకవర్గం పెద్దది కావడంతో అభ్యర్థులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయకపోవడంతో ఓటర్లలో కూడా పెద్దగా ఆసక్తి కనిపించలేదు. ఇది ఓటింగ్‌పై ప్రభావం చూపడంతో పాటు అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలకు తేడా కూడా కనిపించింది. దీనితో గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లకు గాను 183534(80.97) నమోదు కాగా సిర్పూర్ నియోజకవర్గంలో 1,85,254(81.64) నమోదు కాగా ప్రస్తుతం ఆ శాతానికి రెండు నియోజకవర్గాల్లో కూడా పదికి పైగా శాతం తగ్గింది.

పని చేయని అవగాహన కార్యక్రమాలు

కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జిల్లాకు నూతనంగా రావడం వెంటనే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆయన ఎన్నికలను ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నారు. మొదటి నుండి ఒక ప్రణాళిక ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇదే సమయంలో ప్రజాలను చైతన్యపరచడానికి 5కే రన్‌తో పాటు, స్వీప్ ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినప్పటికీ ఓటర్లలో ఆసక్తి లేకపోవడం, నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో చూపిన చొరవ చూపకపోవడంతో ఓటింగ్ శాతం తగ్గింది. అవగాహన కార్యక్రమాలు ఓటర్లను పోలింగ్ బూత్ వరకు తేలేకపోయాయి.

ట్రాక్టర్‌లో వచ్చి ఓటేసి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓటు హక్కు విలువ చెప్పేలా ట్రాక్టర్‌లో వచ్చి ఓటేశారు హీరాపూర్ వాసులు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వారు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని హీరాపూర్ వాసులు ఓటు వేయాలంటే జిల్లా కేంద్రానికి రావాలి. అయితే ఆదివారం భారీ వర్షం కురవడంతో గ్రామానికి వెళ్లే రహదారి బురద మయంగా మారింది. దీంతో ఆటోలు ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో గ్రామంలో ఉన్న ఓటర్లను కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక ట్రాక్టర్ల ద్వారా జిల్లా కేంద్రానికి తరలించారు.



జిల్లాలో ముగిసిన ఎన్నికల పోలింగ్

- ఉదయం 7 గంటల నుండి క్యూలో ఓటర్లు
- మహిళ నిర్వాహక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- ఎన్నికల ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ సురేష్ కుమార్
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం



పోలింగ్ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఆసిఫాబాద్‌లోని మోడల్ పోలింగ్ స్టేషన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ సురేష్ కుమార్ ఎన్నికల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యత ఉండడంతో ఉదయం 6.30 గంటల నుండి ఓటు కోసం ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు.

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా రెండింటిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గంలో ఓటర్లు 2,29,101ఉండగా 1,52,706 మంది 68.14 శాతం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నమోదైన ఓటర్లు 2,27,208 మంది ఉండగా 1,56,098 మంది 67.21 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఉదయం నుండి బారులు తీరిన ఓటర్లు

ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం 7 గంటల నుండి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తొందరగా ఓటు వేయాలని సంకల్పంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల్లో ఓటర్ల కోసం సౌకర్యాలు కల్పించారు.

మహిళా నిర్వాహక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

మహిళల సౌకర్యం కోసం జిల్లా వ్యాప్తంగా మహిళలతో నిర్వహించే పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. దీనిలో పిఓ, ఏపిఓతో పాటు, ప్రతి సిబ్బంది మహిళలు ఉండే విధంగా చూడడంతో పాటు, ఆయా కేంద్రాల్లో ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 198వ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ సురేష్ కుమార్‌లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జడ్పీటీసీ నాగేశ్వరరావు స్థానిక బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రంలో ఓటేశారు.

ఎన్నికల ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికారులు

జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ సురేష్ కుమార్ పర్యవేక్షించారు. ఓటేసినంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఆదివారం కురిసిన వర్షానికి కొంత ఇబ్బంది కలిగినప్పటికీ వాటిని అధిగమించామన్నారు. ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

పోలింగ్ సాగిన తీరు

జిల్లాలో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా నాలుగు గంటల వరకు సాగింది. సిర్పూర్ నియోజకవర్గం లో నమోదైన ఓటర్లు 2,27,208 మంది ఉండగా, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నమోదైన ఓటర్లు 2,27,208 మంది ఉన్నారు. గంటల వారీగా రెండు నియోజకవర్గాల ఓటింగ్ సరళి పరిశీలిస్తే కింది విధంగా ఉంది.

సమయం	సిర్పూర్	శాతం	ఆసిఫాబాద్	శాతం
9 గంటలకు	28028	12.23	35093	15.45
11గంటలకు	69777	30.71	84125	36.72
1 గంటకు	1,30,873	57.60	105824	46.19
3 గంటలకు	1,48 821	65.50	1,40,119	61.16
4 గంటలకు	1,52,706	68.14	1,56,098	67.21



ఓటేసినట్టు ఇంకు చూపిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



ఓటేసి బయటకు వచ్చిన ఎస్పీ సురేష్ కుమార్



ఓటేసిన తొలి ఓటర్లు

నాలుగు గంటల పాటు ఓటింగ్‌కు దూరం

- మంత్రి భరోసాతో పోలింగ్‌లో బోరిగాం ఓటర్లు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని జగన్నాథపూర్ పంచాయతీలోని బోరిగాంకు మౌళికవసతుల్లో భాగంగా ప్రధాన సమస్య రోడ్డు సౌకర్యం కల్పించాలనే డిమాండ్‌తో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం నాలుగు గంటల పాటు ఇక్కడి ఓటర్లు మూకుమ్మడిగా పోలింగ్‌కు దూరంగా ఉంటూ నిరసన వ్యక్తం చేశారు. బోరిగాం బూత్ నెం.49లో 73 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటలకే ప్రారంభం కాగా 11 గంటల వరకు కేవలం ఇద్దరు మాత్రమే తమ ఓటుహక్కును వినియోగించుకోగా మిగితా ఓటర్లు రోడ్డు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఓటు వేయకుండా నిరసన బాటపట్టారు. విషయం తెలియగానే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి బోరిగాంకు చేరుకున్నారు. గ్రామ పెద్దలను కలిసి సమస్యను తెలుసుకున్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్న తమ గ్రామానికి కనీస రోడ్డు సౌకర్యం లేదని గోడును వినిపించారు. ఆయన ఫోన్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు బోరిగాం రోడ్డు సమస్యను వివరించారు. మంత్రి గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో తాను హామీ ఇవ్వలేనని, తానే స్వయంగా గ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరిస్తానని గ్రామస్థులకు భరోసా నిచ్చారు. ఈ సమస్యపై బీజేపీ రాష్ట్ర నాయకుడు కొంగ సత్యనారాయణ సైతం బోరిగాంను సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ విషయం ఎన్నికల అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతామన్నారు. మంత్రి సీతక్క భరోసా ఇవ్వడంతో ఉదయం 11 గంటల అనంతరం ఓటింగ్‌లో పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

పెచ్చులూడి ఎన్నికల సిబ్బందికి గాయాలు

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం బెజ్జూర్ ఆశ్రమ పాఠశాలలోని 219 పోలింగ్ కేంద్రంలో పెచ్చులుడి పడిపోవడంతో ఎన్నికల సిబ్బందికి గాయాలయ్యాయి. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది మార సాయికృష్ణకు స్వల్ప గాయాలు అయ్యాయి. బెజ్జర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. శిథిలావస్థ భవనంలో పాఠశాల ఉంది. అయితే పాఠశాల ప్రారంభం కాకముందు మరమ్మత్తులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం కలిగే అవకాశాలున్నాయంటున్నారు.

నిరంతరం శ్రమించి విద్యుత్ అందించి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో ఎక్కడికక్కడ చెట్లు విద్యుత్ తీగల మీద పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ ఎస్ఈ వాసుదేవ్ సిబ్బందిని అప్రమత్తం చేసి విద్యుత్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు, గాలులతో చెట్లు విద్యుత్ తీగలపై పడి 33, 11 కెవి ఫీడెర్ పరిధిలో 22 స్తంబాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొరిగాయాయని, 59 ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయని, 6 లైన్లు తెగి కింద పడ్డాయని తెలిపారు. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కార్యక్రమంలో ఎటువంటి విద్యుత్తు అంతరాయం లేకుండా విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. వేగంగా విద్యుత్ పునరుద్ధరించడంలో సిబ్బంది ఎంతగానో శ్రమించారని వారందరిని అభినందించారు. ప్రతి సర్కిల్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటల పర్యవేక్షణ ఉంటుందని, విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నెంబరు1800 425 0028, 1912లలో సంప్రదించవచ్చని తెలిపారు.

యువోత్సాహం.. ఎల్లలు దాటి.. ఓటు వేసి

తన తొలి ఓటుతో తీర్పు చెప్పాలని యువత ఆశగా చూస్తోంది. ఓటరుగా నమోదు చేసుకున్న వారు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటేసేందుకు కేంద్రాలకు బారు తీరారు. తీరాలు దాటి తమ ఓటును వినియోగించుకునేందుకు వచ్చారు. జిల్లాలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 18 నుండి 19 మధ్య వయస్సున్న వారు ఆసిఫాబాద్, సిర్పూర్-టి నియోజకవర్గాల్లో 12,529 మంది ఉన్నారు. వీరిలో మొదటిసారి అనేక మంది ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. మొదటిసారి ఓటుతో గొప్ప అనుభూతి పొందినట్లు చెబుతున్న వారి అభిప్రాయాలను నవతెలంగాణతో పంచుకున్నారు.

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అమెరికా నుండి వచ్చి ఓటు వేశా..

అక్కు శివాని, ఆసిఫాబాద్



అమెరికాలో ఎమ్ఎస్ చదువుతున్నాను. నేను ఆలస్యంగా ఇండియాకు రావాల్సింది. అయితే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముందుగానే విమాన టికెట్ బుక్ చేసుకుని వచ్చాను. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ ఎంతో ఉంటుంది. దానిని గుర్తించి ఓటింగ్ సమయం నాటికి ఇండియాకు రావాలని నిశ్చయంతో ప్రణాళిక రూపొందించుకున్నాను. ఓటు వేయడం సంతోషంగా ఉంది.

ఎంతో గొప్ప అనుభూతి పొందాను

బామ్నే పూర్ణిమ, సాలెగూడ



మొదటిసారి ఓటు వేయడం ఎంతో గొప్ప అనుభూతినిచ్చింది. ఓటు నమోదు చేసుకున్న నాటి నుండి ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయని ఎదురుచూస్తున్నాను. నా తొలి ఓటు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

సరైన నాయకున్ని ఎన్నుకోవాలి

అనార్థపు శ్రీనిధి, బాపునగర్



ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా ముఖ్యమైనవి. ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రజల భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో సరైన నాయకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉంది. మొదటిసారి ఓటు హక్కు వినియోగం నేను ఎప్పటికీ మర్చిపోలేను.

ఓటింగ్‌లో భాగస్వామి కావడం సంతోషం

ఎం.రోషిని, స్థానికురాలు



దేశ ప్రధాని ఎన్నుకునే ప్రక్రియకు సంబంధించిన ఓటింగ్‌లో నేను భాగస్వామిని కావడం సంతోషంగా ఉంది. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు సార్థకం అవుతుంది.

నాయకులు బాధ్యతతో వ్యవహరించాలి

వల్లపు రుత్విక్, ఆసిఫాబాద్



ఎన్నికల్లో ఓటు వేసి ప్రతి ఒక్కరు ఎన్నో ఆశలతో ఓటు వేస్తారు. మొదటిసారి ఓటు వేసినందుకు సంతోషంగా ఉంది. అదే సందర్భంలో నాయకులు కూడా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చినప్పుడే ప్రజాస్వామ్యంలో ఓటు విలువ కాపాడబడినట్లు అవుతుంది.

ఓటేసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. తిర్యాని మండలంలోని చింతల మదర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో భర్త సోనేరావు, కుమారుడు సాయినాథ్, కూతురితో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | మే 14, 2024 | www.navatelangana.com

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వంశీకృష్ణ



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన గడ్డం వంశీకృష్ణ సోమవారం మండల కేంద్రంలో పోలింగ్ సరళిని అడిగి తెల్సుకున్నారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలను కలిసి పోలింగ్ ప్రక్రియను అడిగి తెల్సుకున్నారు. పోలింగ్ చివరి నిమిషం వరకు ఓటు హక్కు కలిగివున్న ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేవిధంగా కృషి చేయాలని తెలిపారు. వృద్దులు, వికలాంగులకు సహకరించి ఓటింగ్‌లో పాల్గొనేవిధంగా అధికారులతో సమన్వయంతో ఎన్నిక నిర్వాహణకు కృషి చేయాలని అన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీలో లోక్‌సభ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా పోలింగ్ ముగిశాయి. నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ బదావత్ సంతోష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వద్దులు, వికలాంగులకు వాహనాల సౌకర్యాన్ని కల్పించారు. మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసి 281, 281, 219, 220 నెబర్‌గల పోలింగ్ కేంద్రాల్లో ఏవీఎంలు కాసేపు మోరాయించాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించారు.

ఈవీఎంలో నిక్షిప్తమైన ఓటరు తీర్పు

- పోలింగ్ 67.80 శాతం నమోదు
- ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు
- నస్పూర్‌లో మొరాయించిన ఈవీఎంలు
- ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు
- ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ

నవతెలంగాణ-జైపూర్, మంచిర్యాల

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన పోలింగ్‌తో ఓటర్ల తీర్పు ఈవీఎంలో నిక్షిప్తమైది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. అక్కడక్కడ చెదురు మదురు సంఘటనలు మినహా పోలీసుల పహారాలో ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్, రామగుండం సీపీ స్వయంగా పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు పాటించిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఓటరు సహాయన కేంద్రాల ద్వారా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాటు చేశారు. మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి పచ్చతోరణాలతో అలంకరించి అన్ని సౌకర్యాలు కల్పించారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని నస్పూర్ మున్సిపల్ పరిధిలోని 281,281,219,220 నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి.

ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు

ప్రధాన మూడు పార్టీల అభ్యర్థులు ఓటు హక్కును తమ కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తన తల్లి సరోజతో కలిసి మంచిర్యాలలో తన ఓటు హక్కులను వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తన భార్య స్నేహలత కలిసి రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని జూనియర్ కళాశాలలోగల పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ రామకృష్ణాపూర్ పట్టణంలోని తిమ్మాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలో పోలింగ్ సరళిని పరిశీలించారు.



మంచిర్యాల : ఓటేసేందుకు క్యూలో మహిళా ఓటర్లు

ఓటు వేసిన ప్రముఖులు

చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మందమర్రిలో గల కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో గల పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా కేంద్రంలోని అర్‌బీహెచ్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆయన సతీమణి డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి కార్మెల్ కన్వెంట్ హై స్కూల్‌లో ఓటు వేశారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మందమర్రిలో గల కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రామకృష్ణాపూర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు.

ఇది పోలింగ్ సరళి

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గల 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నమోదైన పోలింగ్ శాతం పరిశీలిస్తే.. ఉదయం 9 గంటలకు చెన్నూర్‌లో 9.49 శాతం, బెల్లంపల్లిలో 12.12 శాతం, మంచిర్యాలలో 10.49 శాతం, ధర్మపురిలో 8.70శాతం, రామగుండంలో 7.64 శాతం, మంథనిలో 10.17 శాతం, పెద్దపల్లిలో 9.24 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 11 గంటల వరకు నమోదైన పోలింగ్ పరిశీలిస్తే చెన్నూర్ నియోజకవర్గంలో 26.35 శాతం, బెల్లంపల్లిలో 30.52 శాతం, మంచిర్యాలలో 24.87 శాతం, ధర్మపూరిలో 28.11 శాతం, రామగుండంలో 21.46 శాతం, మంథనిలో 27.41 శాతం, పెద్దపల్లిలో 25.57 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మధ్యాహ్నం 1 గంట వరకు గల పోలింగ్ నమోదు తీరును పరిశీలిస్తే చెన్నూర్ నియోజకవర్గంలో 45.45 శాతం, బెల్లంపల్లిలో 50.42 శాతం, మంచిర్యాలలో 41.40 శాతం, ధర్మపురిలో 47.15 శాతం, రామగుండంలో 38.78 శాతం, మంథనిలో 48.21 శాతం, పెద్దపల్లిలో 44.40 శాతం ఓటింగ్ పూర్తయ్యింది..సాయంత్రం 3 గంటల వరకు చెన్నూర్ నియోజకవర్గంలో 58.65 శాతం, బెల్లంపల్లి నియోజకవర్గంలో 63 శాతం, ధర్మపురిలో 60.23 శాతం, మంచిర్యాలలో 52.97 శాతం, మంథనిలో 56.20 శాతం, పెద్దపల్లిలో 55.60 శాతం నమోదుగా కాగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మొత్తంగా చూస్తే సాయంత్రం 3 గంటల వరకు 55.92 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. చెన్నూర్ 68.13, బెల్లంపల్లి 70.53, ధర్మపురి 73.34, మంచిర్యాల 59.78, మంథని 69.90, పెద్దపల్లి 71.34, రామగుండం 61.59 శాతం నమోదైంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ పూర్తయ్యేసరికి పెద్దపల్లి నియోజవర్గ పరిధిలో మొత్తం 67.80 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

స్ట్రాంగ్ రూమ్‌కు తరళిన ఈవీఎంలు

జిల్లాలోని మూడు నియోజక వర్గాల్లో ఉపయోగించిన ఈవీఎం, వివి ప్యాట్‌లను మంచిర్యాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి పోలీస్ బందోబస్తు నడుమ తరలించారు. ముల్కల్లలోని ఐజ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు అధికారులు తరలించనున్నారు. ఈవీఎంలను భద్రపరిచిన అనంతరం మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



జైపూర్ : బారులుతీరిన ఓటర్లు



జైపూర్‌లో మోడల్ పోలింగ్ కేంద్రం



జైపూర్ : చెన్నూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే వివేక్



మంచిర్యాల పోలింగ్ కేంద్రంలో పోలీసు బందోబస్తు

మొదటి సారి ఓటువేసిన యువకులు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ మండల పరిషత్ అధ్యక్షురాలు గోదారి రమాదేవి లక్ష్మన్ కుటుంబ సభ్యులు సోమవారం ముదిగుంట గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి సారి ఓటు హక్కు పొందిన ఎంపీపీ కుమారులు వినయ్ కుమార్, సాత్విక్, మర్ది కుమార్తె మౌనిక, మామ గోదారి రాజయ్యలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పార్లమెంట్ ఎన్నికల ద్వార మొదటి సారి వినియోగించుకున్నామని గోదారి వినయ్‌కుమార్, సాత్విక్, గోదారి మౌనిక అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో మేము సైతం భారత పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనడం ఆనందంగా ఉన్నదని వారు పేర్కొన్నారు.

మొదటి సారి వేయడం ఆనందంగా ఉంది

మాసిది సుష్మ (శివ్వారం)



జైపూర్ మండలం శివ్వారం గ్రామానికి చెందిన మాసిది సుష్మ మొదటి సారి పార్లమెంట్ ఎన్నికల ద్వార ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ద్వార రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం అనందంగా ఉంది.

మొదటిసారి ఓటు వేశాను

గడియారం అక్షయ, మంచిర్యాల

నవతెలంగాణ-హాజీపూర్



మొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకున్నాందుకు చాలా సంతోషంగా ఉంది. హైదరాబాదులో ఎంబీబీఎస్ చదువుతున్నాను. ఓటు వేయడానికి మంచిర్యాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నాను. నాలాగే ప్రతి ఒక్కరు శ్రమ అనుకోకుండా భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి. సరియైన నాయకుడిని ఎన్నుకుని దేశ అభివృద్ధికి ప్రతి పౌరుడు తమ సహకారం అందించాలి.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు వేముల కష్ణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు మడావి ఆనంతరావు, యువజన నాయకులు భీరుకురి ప్రవీణ్ బాబులు చేరారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్‌రావు చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ధర్మరావుపేట ఎంపీటీసీ పార్వతి మల్లేష్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఇందన్పల్లి గ్రామంలో జరుగుతున్న ఎంపీ ఎన్నికల పోలింగ్ సరళిని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ సోమవారం పరిశీలించారు. ఆయనతో పాటు బీజేపీ మండలం అధ్యక్షుడు మధుసూదనా రావు, ప్రధాన కార్యదర్శి వంగపల్లి సురేశ్, ఆఫీస్ జనరల్ సెక్రెటరీ నల్లపు కృష్ణ ఉన్నారు. అదేవిదంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పలు పోలింగ్ కేంద్రాలను సదర్శించారు. ఆయన వెంట జడ్పీటసీ ఎర్ర చంద్రశేఖర్ ఎంపీపీ మాదాడి సరోజన నాయకులు భరత్ కుమార్, తాళ్లపల్లి రాజేశ్వర్, జక్కుల భూమేష్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, కడారుల నరసయ్య, జనార్థన్ ఉన్నారు.

ఎన్నికలను బహిష్కరించిన వరిపేట గ్రామస్తులు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను గ్రామ పంచాయతీలోని వరిపేట గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. తమ గ్రామ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికలు బహిష్కరణ చేయగా అధికారులు హామీ ఇవ్వడంతో ఓట్లు వేశామని, కాని ఇంత వరకు మా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఎమ్మెల్యే కూడా ఒక్కసారి కూడా గ్రామానికి రాలేదన్నారు. వెంటనే మా గ్రామ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్నికల్లో తమ ఓట్లు వేయమని అధికారులకు తేల్చిచెప్పారు. దింతో వరిపేట గ్రామస్తులతో అధికారులు మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు సహకరిస్తామని తెలపడంతో మధ్యాహ్నం నుంచి పోలింగ్ ప్రారంభించారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని సత్యసాయినగర్‌కు చెందిన రాథోడ్ భీంరావు(38) ఆదివారం సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకున్నాడు. కుటుంబికులు గమనించి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరళించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మతుడి స్వస్థలం కుమురంభీం జిల్లా కొత్తపల్లి గ్రామం గత కొన్ని సంవత్సరాల క్రితం సత్యసాయినగర్‌కు చెందిన దేవికతో వివాహం కాగా ఇద్దరు పిల్లల ఉన్నారు. మృతుడు స్వగ్రామంలో మద్యం తాగి తిరగడంతో అక్కడి నుంచి లక్షెట్టిపేటకు వలస కూలీగా వచ్చాడు. ఇక్కడ కూడా మద్యం అలవాటు మనకపోవడంతో తరచు భార్యాభర్తల మధ్య గొడవ జరిగేది. చాలాసార్లు నచ్చజెప్పినా ప్రవర్తన మారలేదు. గత మూడు నెలల క్రితం కూడా బాగా తాగి ఇంటికిరావడంతో భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ నెల 1వ తేదిన తన భార్యను కాపురానికి పంపాలని అత్తగారింటికి వెళ్లగా భార్యతో పాటు ఆమె తమ్ముళ్ళు జాదవ్ సంతోష్, జాదవ్ సంతోష్, జాదవ్ శ్రీనివాస్ అనే ముగ్గురు భీంరావును కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి తల్లి రాథోడ్ జంగుబాయి పిర్యాదు మేరకు ఎస్సై-2 రామయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మండలంలో 69.15 శాతం నమోదు

- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలో సోమవారం నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 49 పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుండి ఓటు వేయడానికి ఓటర్లు బారులు తీరారు. ఉదయం వాతావరణం చల్లబడడంతో ఓటు వేయడానికి ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు గంటన్నర పాటు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఎండ తీవ్రతకు మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు కనిపించలేదు. సాయంత్రం వేళ వాతావరణం చల్లబడడంతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 69.15 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన రామగుండం సీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నిర్వాహణ ప్రశాతం వాతావరణంలో కొనసాగే విధంగా ఏర్పాట్లు చేశామని పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధి మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజవర్గం పరిధిలో సోమవారం ఎన్నికల నిర్వాహణ తీరును పరిశీలించారు. ప్రధానంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధి పంకిడి సోమారంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. అదేవిధంగా చెన్నూర్ పట్టణం కేంద్రంలో గల ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంతో పాటు రాపన్‌పల్లి శివారులో గల అంతరాష్ట్ర సరిహద్దు



చెక్‌పోస్టును సంధర్శించారు. విధి నిర్వాహణలో ఉన్న పోలీస్ అధికారులతో పోలింగ్ పరికరాలు, కౌంటింగ్ కేంద్రాలకు తరలింపు తదితర విషయాలపై సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఈ సంధర్భంగా పేర్కొన్నారు. పోలీసుల సూచనల మేరకు ప్రజలు సహకరిస్తూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో సెల్ ఫోన్ సిగ్నల్ లేని ప్రాంతాలలో సాటిలైట్ ఫోన్‌లు ఉపయోగిస్తున్నామని తెలిపారు. ప్రాణహిత పరివాహక ప్రాంతంలో ఫెర్రి పాయింట్స్ వద్ద పోలింగ్ బూతు ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ, నిఘా కొనసాగుతుందని తెలిపారు. స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ పార్టీలతో ఏరియా డామినేషన్ క్యూబింగ్‌లు నిర్వహించడం జరుగుతుందని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ శ్రీనివాస్‌తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లా రెడ్డి పలువురు సీఐలు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో 70.96 శాతం పోలింగ్

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం నిర్వహించిన లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 70.96 శాతం ఓటింగ్ నమోదయింది. ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని రకాల చర్యలు చేపట్టారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలుచేపట్టింది. ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ స్టేషన్లను పంచాయతీ అధికారు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద వృద్ధులు వికలాంగులు గర్భిణీలు చిన్నపిల్లల తల్లుల కోసం ఆటోలను ఏర్పాటు చేశారు. వికలాంగులు ఓటు హక్కు వినియోగించేందుకు పోలింగ్ స్టేషన్ల వద్ద ట్రై సైకిల్లను ఉంచారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద టెంటు మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. తాండూరు మండలం తంగళ్ళపల్లి పోలింగ్ బూత్ వద్ద కొందరు ఓటర్ల ఓట్లు గల్లంత కావడంతో ఆవేదన చెందారు. నియోజకవర్గంలోని కాసిపేట మండలంలో 70.86 బెల్లంపల్లిలో 66.92 తాండూర్‌లో 69.8 కన్నెపల్లిలో 80.4 భీమినిలో 79.50 వేమనపల్లి లో74.28 నెన్నలమండలంలో 74.2 8 పోలింగ్ శాతం నమోదు కాగా మొత్తం 75.96 శాతం పోలైనట్లు అధికారులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

నవతెలంగాణ-తాండూర్



మండలం ద్వారకాపూ గ్రామంలో నిర్మిస్తున్న భక్తాంజనేయ ఆలయ నిర్మాణానికి సింగరేణి కాంట్రాక్టర్ అన్నం రమేష్ సునీత దంపతులు రూ.50వేల విరాళాన్ని అందజేశారు. సోమవారం రూ.50 వేల చెక్కును ద్వారకాపూర్ గ్రామ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ద్వారకాపూర్ హనుమాన్ ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణంలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని లక్షెటిపేట మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నిర్ణీత సమయానికి అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 7.00 గంటలకు ముందే అనేక మంది ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద క్యూ కట్టారు. వృద్ధులు, యువకులు, మహిళలు, కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓటింగో పాల్గొన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పట్టణంలోని పలు బూత్‌లను సందర్శించారు. కేంద్రాల వద్ద జరుగుతున్న ఎన్నికల తీరును పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ప్రజలు అందరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా లక్షెటిపేట సీఐ. అల్లం నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్, పోలింగ్ కేంద్రల వద్ద ఏర్పాట్లను, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎంపీపీ, జడ్పీటీసీ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ మాదాడి సరోజన, ప్రభుత్వ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు అనేది, రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అది ప్రతి ఒక్కరు వినియోగించుకొని, సరైన నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ- సిర్పూర్(టి)



వేంపల్లి, సిర్పూర్ రైలు మార్గంలో మహెబూబాబాద్ జిల్లాకు చెందిన గుగ్లోత్ చంద్రకాంత్(28) రైలు నుండి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సురేందర్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల.. ప్రకారం మహెబూబాబాద్ జిల్లాలోని లాలితండా నరసింహపురం గ్రామానికి చెందిన గుగ్లోత్ చంద్రకాంత్ తన భార్యతో కలిసి మహారాష్ట్రలోని నందూర్‌బార్ పట్టణంలో ఐడీబీఐ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తన అక్క ఇంటికి కొన్ని రోజుల క్రితం వెళ్లి ఎలక్షన్ ఉన్నందున తిరిగి తన ఇంటికి మహెబూబాబాద్‌కు వెళ్తున్నాడు. 12న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు రైలు నుండి పడి మరణించినట్టు తెలిపారు. అతని యొక్క మృతదేహాన్ని తండ్రి గుగ్లోత్ భీముడికి అప్పగించినట్టు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని పోలింగ్ కేంద్రం, గోలేటిలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సురేష్‌కుమార్ సందర్శించారు. దీనిలో భాగంగా జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఓటు వేసేందుకు ప్రజలందరు క్యూలైన్ పాటించాలని ఆయన తెలిపారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే వెంటనే పై అధికారులకు తెలియజేయాలని పోలింగ్ కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి ఆయన సూచించారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

మండలంలోని పలు పోలింగ్ బూతులను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు సందర్శించారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఎన్నికలవేళ మద్యం అమ్మకాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఎన్నికలవేళ మద్యం విక్రయించవద్దని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ బెల్టు షాపుల్లో షరా మామూలుగానే ఆది, సోమవారాల్లో విచ్చలవిడిగా బహిరంగంగానే మద్యం విక్రయాలు కొనసాగాయి. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం మద్యం దుకాణం నుంచి రెండు రోజుల ముందుగానే బెల్టుషాపుల నిర్వాహకులకు సరఫరా చేసి ఇష్టారాజ్యంగా అమ్మకాలు సాగించారు. ఈజ్‌గాంలోని పలు హోటళ్లలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగినప్పటికీ పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తిచూసిన దాఖలాలు లేవు. ఇదే అదునుగా భావించిన హోటళ్ల యజమానులు ఎన్నికల రోజు సైతం మద్యం క్వార్టర్‌కు రూ.40, బీరు బాటిల్‌కు రూ.50 అధనపు రేటుతో విక్రయించారు. తాము మద్యం దుకాణంలో గతంలో కంటే ఎక్కువ ధర చెల్లించామని, అందుకే రేటు భారీగా పెంచి అమ్ముతున్నామని ఓ బెల్టు షాపు నిర్వాహకుడు తెలిపారు. పేరుకే ఈజ్‌గాంలో మద్యం దుకాణం మూసివేసి ఉన్నప్పటికీ ఇందులో పనిచేసే ఓ సేల్స్‌మెన్ గుత్తాగా మద్యం నిల్వ చేసి దుకాణాలకు సరఫరా చేసినట్టు తెలుస్తోంది. ఈజ్‌గాం ఏరియాలో ఎన్నికల వేళ సైతం బాహాటంగా బెల్టుషాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగాయి. మద్యం దుకాణం సేల్స్‌మెన్ బెల్టు షాపులకు సరఫరా చేయడంలో ప్రధాన సూత్రదారిగా వ్యవహరించి విక్రయాలు చేపట్టినట్టు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ తతంగం కొనసాగినా మద్యం విక్రయాలపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. తాము మామూళ్లు ఇస్తున్నందునే తమను కట్టడి చేయడంలేదని ఓ బెల్టుషాపు యజమాని వ్యాఖ్యానించడం గమనార్హం.


యువతకు నిర్దేశకులు వృద్ధ ఓటర్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదనే విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందే. అయితే మారుతున్న పరిస్థితులు అవసరాల నేపథ్యంలో పోలింగ్ రోజు సెలవు దినంగా అనేక మంది భావిస్తున్నారు. అయితే వయసులో వృద్ధులైన అనేకమంది జిల్లావ్యాప్తంగా ఓటేసి ఆదర్శంగా నిలిచారు.

ప్రతి ఎన్నికల్లో ఓటు వేశాను

- కావుడే లచ్చుంబాయ్, సాలెగూడ



నాకు 90 సంవత్సరాలు. స్వతంత్ర భారతదేశంలో ప్రతి ఎన్నికల్లో ఓటు వేశాను. గతంలో ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు తీసుకువెళ్లడానికి ఎవరు కూడా వచ్చేవారు కాదు. ఇప్పుడు పోలింగ్ బూత్ వరకు కూడా నాయకులు, అధికారులు తీసుకువెళ్తున్నారు. గడిచిన అన్ని పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటు వేశాను.

బతికున్నన్ని రోజులు ఓటేస్తా

- షేక్ అబ్దుల్లా, స్థానికుడు



నాకు 100 సంవత్సరాల ఏడు నెలలు. ఇప్పటివరకు పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలన్నింటిలో ఓటేశాను. నేను బతికున్నన్ని రోజులు ఓటు వేస్తాను. అందరూ ఓటింగ్‌లో పాల్గొన్నప్పుడే సరైన నాయకుని ఎన్నిక జరుగుతుంది.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తి

- పార్లమెంట్ ఎన్నికలను పెద్దగా పట్టించుకోని నాయకులు
- ప్రలోభాలు, ప్రచార ఆర్భాటాలు లేకుండానే ముగింపు
- అనుకూలమైన సమయంలో ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు



దహెగాం : ఓటేసేందుకు క్యూ కట్టిన జనం

నవతెలంగాణ-దహెగాం

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జిల్లాలో నక్సలైట్ ప్రభావిత ప్రాంతం కావడంతో ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్‌కు సమయం కేటాయించారు. ఓటర్లు సైతం ఉదయాన్నే పోలింగ్ బూతులకు చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 43 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్మీర్, ఇట్యాల పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలు కావడంతో ప్రతిష్ట బందోబస్తు నిర్వహించారు. అలాగే రావులపల్లి, మొట్లగూడ, దిగిడ, లోహ గ్రామాలు అటవీ ప్రాంతంలో ఉండడం, నక్సలైట్ ప్రభావిత ప్రాంతం కావడంతో ప్రత్యేక సీఆర్‌పీఎస్ బలగాలతో బందోబస్తు నిర్వహించారు. చాలాచోట్ల మధ్యాహ్నం ఒంటి గంట వరకే దాదాపుగా పోలింగ్ పూర్తయి ఓటర్లు లేక పోలింగ్ కేంద్రాలు వెలవెల బోయాయి. మండలవ్యాప్తంగా మొత్తం 77 శాతం ఓటింగ్ నమోదైనట్టు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. పార్వతిపేటలో అత్యధికంగా 91.3 శాతం ఓటింగ్ నమోదు కాగా రెండవ అత్యధిక ఓటింగ్ శాతం లోహాలో 89 శాతం నమోదైనట్టు పేర్కొన్నారు.

కౌటాల : పార్లమెంట్ ఎన్నికలు సోమవారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ సమయంలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదు. కౌటాల సీఐ సాధిక్‌పాషా ఆధ్వర్యంలో ఎస్ఐ మధూకర్ బందోబస్తు ఏర్పాటుచేశారు. ఓటర్లకు పోలింగ్ సమయంపై అధికారులు ఎలాంటి అవగాహన కల్పించకపోవడంతో పలు గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. టీవీలలో ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు అని ప్రచారం జరగడంతో ఎండతీవ్రత వల్ల ఓటర్లు సాయంత్రం ఓటు వేసేందుకు వచ్చే సరికి అధికారులు సమయం దాటిందని ఓటు హక్కు కల్పించలేదు. మండల కేంద్రంతో పాటు తలోడి, తాటిపెల్లి, గుడ్లబోరి తదితర గ్రామాల్లో సమయం దాటిపోవడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా బీఎల్‌ఓలు ఓటర్లకు పూర్తిస్థాయిలో పోల్ చిట్టీలు అందించలేకపోవడంతో పలువురు ఓటర్లు తమ పేర్ల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేసిన బీఎల్‌ఓలు వీరివల్లనే పోలింగ్ శాతం తగ్గిందని పలువురు ఆరోపిస్తున్నారు. పోల్ చిట్టీలు రాకపోవడంతో ఓటరు లిస్టులో తమ పేరు లేదేమోనని ఓటు వేయడానికి రాలేకపోయారు. గుడ్లబోరిలో ఓటు వేయడానికి గంటల తరబడి ఓటర్లు బారులు తీరారు. గుడ్లబోరి గ్రామంలో పురు వృద్ధుడు తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. మండలవ్యాప్తంగా సుమారుగా 72 శాతం ఓటింగ్ నమోదైంది.

చింతలమానేపల్లి : మండల వ్యాప్తంగా సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతగా ముగిశాయి. 33 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరిగింది. మండలంలోని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అత్యధికంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం నుంచి పోలింగ్ మందకొడిగా సాగింది. తొలి సారి ఓటు హక్కు ఉన్న యువతి యువకులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆశక్తితో వచ్చారు. 77.77 శాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. కౌటాల సీఐ షాధిక్ పషా, ఎస్సై నరేష్ పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

బెజ్జూర్ : మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుండి ఓటు వేయడానికి ఓటర్లు పోలింగ్ బూతులకు చేరుకున్నారు. 38 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. మండలంలో 63 శాతం పోలింగ్ అయినట్లు అధికారులు తెలిపారు.

వాంకిడి : మండలంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఉదయం నుండే మండలంలోని ఇందానీ గ్రామంలో మహిళలు, పురుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

జైనూర్ : సార్వత్రిక ఎన్నికల్లో నిర్వహణలో ఏజెన్సీ మండలాలైన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం మండలంలో 33 పోలింగ్ కేంద్రాలుండగా అందులో 24069 ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా సిర్పూర్(యు) మండలంలో మొత్తం 23 పోలింగ్ సెంటర్లలో, లింగాపూర్‌లో 17 పోలింగ్ కేంద్రాల్లో 10369 మంది ఓటర్లు ఉండగా అందులో 7720 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 18 సంవత్సరాలు దాటిన యువతి, యువకులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి సిర్పూర్(యు) మండలంలోని పాముల్‌వాడ గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రం వద్ద యువత పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా టెంట్లు వేయించి పండుగ వాతావరణం కల్పించేల నిర్వహించారు.

ఆరోగ్యం బాగలేకున్న ఓటేసిన జామిని ఎంపీటీసీ

కొన్ని సంవత్సరాల క్రితం శ్మశాన వాటికలో పనిచేస్తున్న సమయంలో ఈదురు గాలులు రావడంతో ఎంపీటీసీ లటపటె మాధవ్‌పై రేకులషెడ్డు పడిపోవడంతో రెండు కాళ్లు, చేతులు పడిపోయాయి. ఎన్నికలు జరుగుతుండడంతో సోమవారం జామిని గ్రామంలో నివసిస్తున్న ఎంపీటీసీ లటపటె మాధవ్ తన ఓటును వినియోగించుకుంటాననే సంకల్పంతో వీల్‌చైర్‌తో పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటును వేశారు. స్థానిక మాజీ సర్పంచ్ మెస్రం రాహుల్ సాయంతో ఓటు హక్కును పోలింగ్ కేంద్రానికి వెళ్లి సద్వినియోగం చేసుకున్నారు.

రెబ్బెన : మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెబ్బెన ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ తుంగెడలోని జెడ్పీ హైస్కూల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో జెడ్పీ హైస్కూల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోలేటిలోని సింగరేణి హైస్కూల్లో టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు నాయకులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోలేటిలోని ఆశ్రమ పాఠశాలలో కాంగ్రెస్ నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

పెంచికల్‌పేట్ : మండలంలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 21 పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండే ఓటర్లు తరలివెళ్లి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో నాలుగు రూట్లలో రూట్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించారు. ఎస్ఐ కొమురయ్య ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును పటిష్టంగా నిర్వహించారు.



పెంచికల్‌పేట్ : ఓటేసేందుకు కేంద్రానికి వస్తున్న ఓటర్లు

సిర్పూరులో 68.14 శాతం పోలింగ్

- గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే తక్కువ పోలింగ్ నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



లోక్‌సభకు సోమవారం జరిగిన ఎన్నికలలో సిర్పూరు నియోజకవర్గంలో 68.14 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,29,101 మంది ఓటర్లు ఉండగా, 1,63,887 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం నాలుగు గంటల వరకు కొనసాగింది. నక్సల్ ప్రభావిత నియోజకవర్గం కావడంతో పోలింగ్ నాలుగు గంటల వరకే నిర్వహించారు. నాలుగు గంటల వరకే పోలింగ్ ఉండడంతో ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కాగా పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల నమోదు ప్రక్రియ సక్రమంగా లేకపోవడం ఓటర్లను ఇబ్బందులకు గురి చేసింది. ఒకే కేంద్రంలో రెండు లేదా మూడు పోలింగ్ బూత్‌లు ఉండగా, ఒక బూత్‌లో పెద్ద మొత్తంలో ఓటర్లు బారులు తీరి ఉండగా, పక్కనే ఉన్న మరో బూత్‌లో ఓటర్లు లేకపోవడం ఇక్కడ గమనార్హం. ఈ పరిస్థితి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించింది. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను సమీక్షించారు. కొన్ని చెదురు మదురు ఘటనలు మినహా మొత్తంగా నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది.

నాలుగు గంటల వరకే పోలింగ్

నక్సల్ ప్రభావిత ప్రాంతం కావడంతో ఈ నియోజవర్గంలో పోలింగ్ నాలుగు గంటల వరకే కొనసాగింది. దీని ప్రభావం పోలింగ్ శాతంపై పడినట్లు చెప్పవచ్చు. ఎండాకాలం కావడంతో నాలుగు గంటల వరకు ఎండ ఉండడంతో మధ్యాహ్నం పెద్దగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రాలేదు. సాధారణంగా సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ఉంటుందని ఓటర్లు భావించారు. నాలుగు గంటలకే పోలింగ్ ముగియడంతో స్థానిక సుప్రభాత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు వెనుతిరిగి వెళ్లారు. నాలుగు గంటల తర్వాత కేంద్రానికి వచ్చిన ఓటర్లు తమను లోనికి అనుమతించాలని కోరగా దీనికి అధికారులు నిరాకరించారు. దీనితో అక్కడ కొద్ది సేపు వాగ్వివాదం కొనసాగింది. చివరికి ఓటర్లు ఓటు వేయకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు.

గత ఎన్నికలతో పోలిస్తే తక్కువే

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలలో తక్కువ శాతం పోలింగ్ నమోదైంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో 69.52 శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుతం 68.14 శాతం పోలింగ్ నమోదైంది. గత లోక్‌సభ ఎన్నికలలో సిర్పూరు నియోజకవర్గంలో 2,03,165 మంది ఓటర్లుండగా, 1,41,232 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో 81.16 శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం 2,29,101 మంది ఓటర్లకు గాను, 1,63,887 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 68.14 పోలింగ్ శాతం నమోదైంది.

ప్రశాంతంగా కొనసాగిన ఎన్నికలు

నవతెలంగాణ-నార్నూర్

నార్నూర్ మండలంలోని 23 గ్రామపంచాయతీల్లోని 32 పోలింగ్ బూత్‌లు, గాదిగూడ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లోని 28 పోలింగ్ బూత్ కేంద్రాల్లో సోమవారం లోక్ సభ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. తహసీల్దార్‌లు రాజలింగం, విజయనందం మండలాల్లో 90 శాతం వరకు పోలింగ్ జరిగినట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు టెంట్, నీటి, వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో ఓటర్లు ఉదయాన్నే క్యూలో బారులు తీరారు. పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

బజార్‌హత్నూర్ : మండలంలో పార్లమెంటు ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని జాతర్ల గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంతేకాకుండా పలువురు నాయకులు తమ తమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు.

కుభీర్ : ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కిరణ్ కొమ్రెవార్ అన్నారు. సోమవారం మండలంలోని నిగ్వా గ్రామంలో ఎన్నికల్లో భాగంగా చైతన్య కిరణ్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు అనే ఆయుధాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

లోక్‌సభ ఎన్నికల్లో మంగళవారం సిర్పూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తన స్వగ్రామం బెజ్జూరు మండలంలోని రెబ్బెన గ్రామంలో (బూత్ నెం.234) ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమాకాన్వెంట్ (బూత్ నెం.94)లో తన సతీమణి కోనేరు రమాదేవితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ స్థానిక సర్‌సిల్క్‌లోని శిశుమందిర్ పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న స్థానిక ఆర్‌ఆర్‌ఓ కాలనీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ తన కుటుంబసభ్యులతో కలిసి స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. సీపీఐ(ఎం) నాయకుడు ముంజం ఆనంద్‌కుమార్ కాగజ్‌నగర్ మండలం చింతగూడలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు తమ తమ పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓట్ల పండుగ రోజు మార్కెట్ బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ అయ్యేలా ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా సోమవారం వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించింది. ప్రతి ఒక్కరు ఓటు వేయాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో దుకాణదారులు సోమవారం తమ దుకాణాలను మూసివేసి వర్కర్లకు సెలవు ఇచ్చారు. దీంతో ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధానమార్కెట్ మొత్తం బోసిపోయినట్లు కనిపించింది. పోలీసులు, ఓటు వేసే సాధారణ ప్రజానీకం తప్ప, దుకాణాలు ఎక్కడా కనిపించలేదు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా తరలివచ్చి హక్కును వినియోగించుకున్నారు.

లింగి వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-తలమడుగు

లింగి వృద్ధాశ్రమంలో సోమవారం మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన కంచం హనుమయ్య జ్ఞాపకార్థం మనవడు, మనవరాలు కంచం రాజేశ్వరి, అశోక్, ఆకాష్, ఆకాంక్షలు సోమవారం అన్నదానం చేపట్టారు. 11 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం అన్నదానం చేస్తున్నామని తెలిపారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని కోరారు.



ఎన్నికల్లో పోలీసుల పటిష్ట బందోబస్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ తరపున పటిష్ట బందోబస్తు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. సోమవారం ఆయా పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఓటింగ్ ప్రక్రియను ఎస్పీ గౌస్ ఆలంతో పాటు డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పరిశీలించారు. పట్టణంలోని మహాలక్ష్మివాడ, ఖానాపూర్, కెఆర్‌కె, హిందీ హైస్కూల్, తిరుపెల్లి, హమాలివాడ, మార్కెట్ యార్డ్, దస్నాపూర్ తదితర పోలింగ్ కేంద్రాలను అలాగే పొన్నారి, సుంకిడి, రుయ్యాడి గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బంది విధులను ఎస్పీ పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా చూడాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. నిబంధనల మేరకు వంద మీటర్ల లోపల ఓటర్లు తప్ప ఇతరులు రాకుండా చూడాలన్నారు. అనుమతిలేని వస్తువులను లోనికి పంపించవద్దని, ఓటరును పూర్తిగా తనిఖీ చేయాలని సూచించారు.

స్వల్ప ఉద్రిక్తత..రంగంలోకి పోలీసులు

పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో రాజకీయ పార్టీల నాయకులుండాలని నిబంధన ఉంది. అయితే సోమవారం శాంతినగర్‌లో ఉర్దూఘర్ షాదిఖానా పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నాయకులు సర్కిల్ లోపలికి రావడంతో పోలీసులు పలుమార్లు వారిని హెచ్చరించారు. అయిన వారిలో మార్పు రాకపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టే యత్నం చేశారు. ఈ క్రమంలో ఒకరిద్దరిపై లాఠీ ఝులిపించారు. అయితే ఒకరు రాయి(బండ) తీసుకొని పోలీసులపై తిరబడ్డారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ సీఐ సత్యనారాయణ అక్కడి చేరుకొని వారిని చెదరగొట్టి పలువురిని అదుపులోకి తీసుకున్నారు.


ఉత్సాహంగా ఓటేసిన కొత్త ఓటర్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసేందుకు యువత ముందుకు వచ్చింది. కొత్త ఓటర్లు సైతం తమ మొదటి ఓటు హక్కును వినియోగించుకొని సంబరపడ్డారు. మొదటిసారి ఓటేయడం ఆనందంగా ఉందని, పార్లమెంట్ పెద్ద ఎన్నికల్లోనే తమ ఓటు హక్కును మొదటిసారి వినియోగించుకోవడం పట్ల చాలా సంతోషంగా ఉందని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం రాకపోవడంతో నిరాశకు చెందిన యువత, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు వచ్చేసరికి కొందరు అర్హత సాదించారు. దీంతో ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొందరు ఇతర ప్రాంతాల నుండి వచ్చి తమ మొదటి ఓటు వేశారు. కొంత మంది కొత్త ఓటర్ల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

మొదటిసారి వేయడం సంతోషంగా ఉంది


- యశస్విని, ఆదిలాబాద్



మొదటి సారి ఓటు వేయడం చాలా సంతోషంగా ఉంది. నేను ఇక్కడే ఆదిలాబాద్‌లో జాబ్ చేస్తుంటాను. ఓటరుగా నమోదు అయ్యాక ఓటు ఎప్పుడెప్పుడు వేయలా అని ఆసక్తిగా ఎదురు చూశాను. ఓటు హక్కు వినియోగించుకోవడంతో తెలియని ఉత్సాహం కలిగింది. ఓటు వేయడం అనేది ఒక పండుగ వాతావరణం లాగా కనిపించింది.


ఓటేయడానికి హైదరాబాద్ నుండి వచ్చాను

- పాల్ సందేశ్, ఆదిలాబాద్



ఓటు హక్కు రావడం దాన్ని వినియోగించుకోవడం సంతోషంగా అనిపించింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ చేస్తున్నాను. మొదటిసారి ఓటు వేయడానికి అర్హత లభించడంతో ఓటేయడానికి హైదరాబాద్ నుండి వచ్చాను. ఓటు వేయడంతో ఒక నాయకుడిని ఎన్నుకునే హక్కు, అవకాశం వచ్చినందుకు సంతోషపడ్తున్నాను.

పోలింగ్ ప్రక్రియ బాగుంది : ధనుష్, ఆదిలాబాద్



కొత్త ఓటరుగా నమోదు కావడానికి అర్హత వచ్చే వరకు ఎదురుచూశాను. ఓటు వేయడానికి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో హక్కు రావడంతో ఆనందాన్ని కలిగించింది. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాను. ఓట్ల పండుగ రావడంతో తొలిసారిగా ఓటు వేసేందుకు జిల్లాకు వచ్చాను. పోలింగ్ కేంద్రం, ఏర్పాట్లు పోలింగ్ ప్రక్రియ మొదటిసారిగా చూడడంతో చాలా బాగుంది.